


# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

### అంకురం

"**ఈ ముసల్దాన్ని** ఇంకా ఎందుకు భరిస్తున్నావ్? ఏ ఓల్డేజ్ హోంలోనో చేర్చచ్చుగా?" కూతురు ఈసడింపుగా చెప్పింది.

శారద దెబ్బతిన్నట్లుగా చూసింది. అత్తగారు విన్నారేమోనని కంగారు పడింది. కాని ఆవిడ పెరట్లో మామిడి చెట్టుకింద మంచం వేసుకుని పడుకుని ఉంది.

"ఏం మాట్లాడుతున్నావో నీకు తెలుస్తోందా? నాయనమ్మని అలా అనచ్చా?" తీవ్రంగా అడిగింది.

"నాన్నేలేడు. ఇంక వాళ్ళమ్మని మనం ఎందుకు చూడాలి? అసలు నిన్ను ఎంత హింసలు పెట్టింది? నాన్నతో నీమీద చెప్పి నిన్ను తిట్టించేది. పాపం నువ్వు ఆఫీస్ పని, ఇంటి పని, పైన నాయనమ్మ సాధింపులు, నాన్న తిట్లు. హు ఎలా భరించావో ఏమిటో!?" కూతురు సానుభూతిగా చెప్పింది.

శారద కొడుకువైపు చూసింది. అతనిలోనూ అదే భావం.

"నన్నెంత సాధించేది? ఆడపిల్లవి. ఆ గంతులేమిటి? పడి కాలో చెయ్యో విరిగితే ఎవరూ పెళ్ళి చేసుకోరు. ఇంత లేటుగా ఇంటికి వచ్చావేంటి? ఎక్కడ తిరిగావు... అబ్బ నస అనుకో."

"ఆవిడ పూర్వకాలం మనిషి. కోడళ్ళని సాధించాలి లేకపోతే వాళ్ళు అణిగిమణిగి ఉండరు అనే కాలానికి చెందింది. ఒక్కడే కొడుకు. కోడలు వాడిని కొంగుకి ముడేసుకుంటుందేమో అనే అనుమానం కూడా ఉంది. దాంతో అలా చేసింది కానీ నాయనమ్మ నాకు ఎంత సహాయం చేసిందో తెలుసా? పులిలాగా ఆవిడ అండగా ఉండబట్టే ఇన్నేళ్ళు నేను నిశ్చింతగా ఉన్నాను." శారద కళ్ళల్లో నీళ్ళు.

"అంతా నువ్వే చేసావు. ఆవిడేం చేసింది?" మజ్జిగ పోసుకుంటూ కూతురు అడిగింది.

శారద ఓ క్షణం కూతురి వంక చూసి అడిగింది.

"సరే చిన్నా. ఒప్పుకుంటాను. నాయనమ్మ నన్ను ఏడిపించింది. నాకేం సాయం చేయలేదు. నాన్నతో తిట్టించేది. మరి కూతురివి. నువ్వేం చేసావు? పగలు ఎటూ నాకు ఆఫీస్. మీకు స్కూల్. మరి సాయంత్రాలు నువ్వు చేయచ్చుగా సాయం? అమ్మ ఇంటా బయటా కష్టపడిపోతోంది అనుకున్నప్పుడు టేబుల్ మీద కంచాలు, గ్లాసులు పెట్టడం, తిన్నాక అన్నీ తీసుకెళ్ళి సింక్‌లో పెట్టడం, మిగిలిన పదార్థాలు ఫ్రిజ్‌లో సర్దడం చేయచ్చుగా? కంచంలో అన్నం వడ్డించి కనీసం అరడజను సార్లు పిలిస్తే, ఏడోసారి విసుక్కుంటూ వచ్చి,

నన్నేదో ఉద్ధరించినట్లు తినేదానివి. నిన్ను ఎక్స్‌కర్షన్‌కి పంపలేదనో, నీకు నచ్చిన డ్రెస్ కొనివ్వలేదనో నాన్నకి నామీద కంప్లెంట్స్ చెప్తూనే ఉండేదానివి. మరి ఆవిడ కంటే నువ్వేం గొప్ప?"

తల వంచుకుని అన్నం తింటున్న కొడుకు తల్లివైపు ప్రశంసగా చూసాడు.

"ఆవిడ పొద్దుటిపూట పనంతా చేసేది. మనకి బాక్స్‌లు రెడీ చేసి ఇచ్చేది. సాయంత్రం రాగానే తినడానికి స్నాక్స్ చేసేది. ఆవిడకి రెస్ట్ ఇవ్వాలనే నేను సాయంత్రాలు వంట చేసేదాన్ని. పుట్టింటి అండలేని నాకు రెండు పురుళ్ళు పోసింది. మూడోనెలనించే ఆఫీస్‌కి వెళ్తే మిమ్మల్నిద్దర్నీ పెంచింది. ఒక్క పువ్వు, ఒక్క ఆకు కూడా పోకుండా మనింటికి కాపలా కాసింది. నీకు వయసొచ్చాక పోకిరి వెధవలు ఇంటిముందు తిరుగుతూంటే సివంగిలా మీద పడి అరిచేది. నాయనమ్మ ఒక రక్షణ. ఒక కోటగోడ మనకి.."

శారద కన్నీళ్ళు తుడుచుకుని మంచినీళ్ళు తాగి చెప్పింది.

"అలాంటి మనిషి నాన్నపోగానే ఎలా అయిపోయిందో మీరు చూసారా? నన్ను సాధిస్తూ, మిమ్మల్ని తిడుతూ రోజూ నాన్నతో కలిసి భోజనం చేసి, ఆ తర్వాత అరగంట పాటు కొడుకుతో లోకాభిరామాయణం మాట్లాడుతూ మహారాణిలాగా బతికిన నాయనమ్మ ఇప్పుడు రోజు మొత్తంలో పదిమాటలు కూడా మాట్లాడటం లేదు. కొడుకు పోవడంతో తనిల్లే పరాయి ఇల్లు అని ఫీలవుతోంది. నేను పొద్దున్నే వంట చేసి పెట్టి చెప్పి వెళ్ళినా సాయంత్రం వచ్చి చూస్తే అది కదలడం లేదు. నేనే పోట్లాడి ఏడ్చి తినిపిస్తున్నాను. మీరు ఊరినించి రాగానే నేను చెప్పినా సరే ఆవిడని పరామర్శించలేదు. ఇప్పుడు ఈ మాటలు... నా పెంపకం మీద నాకు అనుమానం వస్తోంది చిన్నా. అలాంటి నిస్సహాయ వృద్ధురాలిని ఓల్డేజ్ హోంలో పడేయమంటావా? మీ నాన్న తల్లిని ముసల్ది అంటావా?" దుఃఖంతో ఆగిపోయింది.

కూతురు కంచంలో వేలితో గీతలు గీస్తూ ఓ నిమిషం పాటు ఉండిపోయింది. తర్వాత చెప్పింది.

"నిజమే అమ్మా.. నాకూ నాయనమ్మకి తేడాలేదు. సారీ ఆవిడ సైకాలజీని నువ్వు అర్థం చేసుకున్నట్లు నేను అర్థం చేసుకోలేదు. ఇంకా నయం. నా మాటలు నాయనమ్మ వినలేదు. వింటే ఎంత బాధపడేదో."

వితండవాదం చేయకుండా కూతురు తప్పు ఒప్పుకున్నందుకు శారదకి ఆనందమేసింది.

కొడుకు కంచం తీసుకెళ్ళి సింక్‌లో పెట్టి వెళ్ళి పడుకున్నాడు.

మర్నాడు కొడుకు వరండాలో మంచం మీద పడుకున్న నాయనమ్మ పక్కన కూర్చుని చెప్పాడు.

"నాయనమ్మా నాకు హైద్రాబాద్‌లో ఉద్యోగం వచ్చింది. ఓ వారంలో వెళ్ళి జాయిన్ అవాలి. నువ్వు నాతో రావాలి."

ఆవిడ వాడివంక ఓసారి చూసి వాడి ఒళ్ళో తలపెట్టుకుని పెద్ద పెట్టున ఏడ్చింది. వాడూ ఏడ్చాడు. చీపురు పుల్లల్లా అయిపోయిన ఆవిడ చేతులు పట్టుకుని మళ్ళీ చెప్పాడు.

"చూడు. ఎంత సన్నగా అయిపోయావో, ఇక్కడుంటే నాన్న జ్ఞాపకాలతో ఇలాగే ఉంటావు. నేను వెళ్ళి రిజర్వేషన్ చేయించుకొస్తా. మనం హైద్రాబాద్ వెళ్దాం."

ఆవిడ కొంచెం తెప్పరిల్లి చెప్పింది.

"అమ్మ, చెల్లాయ్ ఇద్దరూ ఆడవాళ్ళు వంటరిగా ఉంటే కష్టంరా. నేనుంటే ఆ దారివేరు. రానులే."

"చెల్లాయ్ కూడా మనతో వస్తుంది నాయనమ్మా. అక్కడేవో కంప్యూటర్ క్లాసుల్లో చేరుతుందిట. అమ్మకేం భయంలేదులే, ఆఫీసు, ఇల్లు తెలిసిన ఊరు, తెలిసిన మనుషులు."

ఆవిడ ఈసారి నిరాకరించలేదు. ఓపికగా లేచి మనవడి ఇంట్లోకి కావలిసిన చిన్న చిన్న వస్తువులు, పదార్థాలు సర్దుతున్న అత్తగారిని చూసి శారద కొడుకుని మనసులోనే మెచ్చుకుంది.

కొడుకుపోయినా మనవడు ఉన్నాడు, వాడు తనకి అండగా ఉంటాడు అనే మనో స్థైర్యం రాగానే ఆవిడ మామూలు మనిషైంది.

ఆరునెలల తర్వాత పెన్షన్ తీసుకోడానికి వచ్చిన ఆవిడ పూర్వంలాగే పులిలా గర్జించింది. 'మీ అమ్మ ఇంతేరా' అని మనవడికి చాడీలు చెప్పింది. ఉన్న పదిరోజులు పొద్దుటిపూట వంట చేసి కోడలికి బాక్స్ ఇచ్చింది. శారద కొడుకు వంక కృతజ్ఞతగా చూసింది.

కూతురి పెళ్ళి. సంబంధం కుదర్చడం దగ్గర నించి అన్ని విషయాలు నాయనమ్మే చూసుకుంది. ఆవిడ పెద్దరికాన్ని గౌరవించి ముగ్గురూ పెత్తనం అంతా ఆవిడకే ఇచ్చారు. ఆవిడ అన్నీ విచారించి చేసిన పెళ్ళికొడుకు భార్యని పువ్వుల్లో పెట్టి చూసుకుంటున్నాడు.

మనవరాలు నెలతప్పినప్పుడు వెళ్ళి పిల్లవాడు పుట్టాక వచ్చింది. మనవడి పెళ్ళికాగానే కోడలి దగ్గరకి వచ్చేసింది.

ఎనభై రెండేళ్ళ వయసులో ఆవిడ ప్రశాంతంగా కన్నుమూసింది.

"ఇంకెంతకాలం పని చేస్తావమ్మా. వి.ఆర్ తీసుకుని నా దగ్గరకి వచ్చెయ్" నాయనమ్మ సంవత్సరీకాలకి వచ్చిన కొడుకు తల్లితో అభిమానంగా చెప్పాడు.

శారద కోడలి వైపు చూసింది. ఆ అమ్మాయి ముఖంలో అయిష్టం.

"అలవాటైపోయింది. ఖాళీగా ఉండలేనురా. అదీగాక ఈ ఇల్లు, ఊరు కూడా వదల్లేను. మరీ కాళ్ళూ చేతులు పని చేయనప్పుడు అప్పుడు చూద్దాం. నువ్వు, చెల్లాయ్ కనీసం ఏడాదికోసారైనా వస్తూండండి. నేనూ మీ దగ్గరకి వస్తూపోతూ ఉంటాను." నిరాకరించింది.

కొడుకు బాధపడితే, కోడలి మొహంలో రిలీఫ్.

"అమ్మని ఇక్కడే ఉండనివ్వరా. నాకు మానసికంగా రెస్ట్ కావాలనుకుంటే, ఈ ప్రపంచంలో నాకు గుర్తొచ్చేది మన ఊరు, మన ఇల్లు" తల్లి ఒళ్ళో తలపెట్టుకుని పడుకున్న కూతురు చెప్పింది.

ఆ చర్చతో అక్కడితో ఆగిపోయింది.

"మీ అమ్మని ఎందుకు మనతో రమ్మంటున్నావు? నాకు ఇంట్లో మూడో మనిషి ఉండటం ఇష్టంలేదు. అంతగా డబ్బు కావాలంటే ఎంతో కొంత పంపిద్దాం." కోడలు కొడుకుతో అంటున్న మాటలు పక్కగదిలోని శారదకి వినిపించాయి.

"చూడూ. నేను నీ విషయాల్లో ఎప్పుడూ జోక్యం చేసుకోలేదు. మన ఇంట్లో ఫర్నిచర్, నా బట్టలు, నా అలవాట్లు అన్నీ నీ ఇష్టప్రకారమే మారుస్తున్నా నేను ఎదురు చెప్పలేదు. మా అమ్మ, నేను, చెల్లి ఒక యూనిట్. దయచేసి మా మధ్యకి రావద్దు. నేను సహించను. నాయనమ్మ ఏరికోరి చెల్లికి చేసిన అబ్బాయి మా కుటుంబంలో సభ్యుడయ్యాడు. నేను ప్రేమించి చేసుకున్న నువ్వు ఇంకా అతిథిలాగే ఉన్నావు. నాన్న లేకపోయినా అమ్మ నాయనమ్మని ఎంత బాగా చూసుకుందో నీకు చాలాసార్లు చెప్పాను. ఆ సంస్కారం లేకపోయినా, కనీసం నిశ్శబ్దంగా ఉండు." కొడుకు భార్యతో అనునయంగా చెప్పినా కొంచెం కఠినత్వం ధ్వనించింది.

శారదకి చాలా కాలం తర్వాత కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. తన పెంపకమే కాదు తన ఆచరణ కూడా పిల్లలకి విలువలని నేర్పింది. తల్లిగా నేను సక్సెస్ అనుకుంది తృప్తిగా.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments on this story